సేవలు నిల్.. సర్వేలు ఫుల్!

- సచివాలయ సేవలకు స్వస్తి పలికిన కూటమి సర్కార్
- సిబ్బందితో వివిధ రకాల సర్వేలు
- సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకు పరుగులు పెడుతున్న జనం


కొండపి గ్రామ సచివాలయం

కొండపి: సచివాలయాలకు కూటమి గ్రహణం పట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని సేవలు ఇంటి గడప ముందుకు తీసుకువచ్చి పాలనను సులభం చేసింది. ఇంతటి పేరును ఓర్వలేక కూటమి ప్రభుత్వం కక్షగట్టి సచివాలయాలను నిర్వీర్యం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత సేవలను పక్కనపెట్టి సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటా తిప్పుతోంది. దీంతో ప్రజలకు సచివాలయంలో సేవలు అందకపోవడంతో వారు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఉద్యోగులపై పెరిగిన పని ఒత్తిడి..

కొండపి నియోజకవర్గంలో కొండపి మండలంలో 14 సచివాలయాలు, టంగుటూరు మండలంలో 18 సచివాలయాలు సింగరాయకొండ మండలంలో 15 సచివాలయాలు, జరుగుమల్లి మండలంలో పది సచివాలయాలు, మరిపూడి మండలంలో 14, పొన్నలూరు మండలంలో 13 సచివాలయాలు ఉన్నాయి. అందులో దాదాపు 700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రతి శాఖకు ఒక ఉద్యోగం చొప్పున ప్రతి సచివాలయంలో 11 మందిని నియమించారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ సిబ్బంది వలంటీర్ల సమన్వయంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ క్యాస్ట్ సర్టిఫికెట్ నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వరకు అన్ని సేవలను సచివాలయంలోని అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సేవలకు స్వస్తి పలకడమే కాకుండా సచివాలయ సిబ్బందిపై వివిధ రకాల సర్వే పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందనే విమర్శలు వినపడుతున్నాయి. సెలవు రోజులతో సంబంధం లేకుండా సర్వేలు చేయాలని ఆదేశించడం, టార్గెట్‌లు పెట్టి మరీ పెట్టడం మాతృశాఖ పనులతో పాటు బీఎల్‌ఓ విధులు ఇలా అన్ని రకాల పనులను చేయాలని ఆదేశిస్తున్నారు. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సర్వేల కోసం సచివాలయ ఉద్యోగులు వీధివీధినా తిరగడంతో సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. రైతు సేవా కేంద్రాలలో పనిచేస్తున్న వీఏఏలు సర్వేల పేరుతో బయటకు వెళ్లడంతో రైతు సేవా కేంద్రాలకి వెళ్లి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివిధ రకాల సర్వేలు..

సచివాలయ సిబ్బందిని సర్వేల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయించాలి. పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ నమోదు వంటి ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. వర్క్ ఫ్రం హోం పేరుతో 18 నుంచి 50 సంవత్సరాల వయస్సులోపు ఉన్న వారి జాబితా తయారు చేయాల్సి ఉంటుంది. పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ భాగస్వామ్యంతో పి ఫోర్ సర్వే, నాన్ ఏపీ రెసిడెన్షియల్ వారిని గుర్తించడం, హౌస్ జియో ట్యాగింగ్ వంటి సర్వేలు చేయిస్తున్నారు. ఇంటింటా తిరిగి సర్వే చేస్తున్న ఇంటి యజమాని సెల్ ఫోనుకు వచ్చిన ఓటీపీ చెప్పకపోతే చేసిన పని అంతా వృథా అవుతోంది. మరి మొదటి నుంచి చేయాల్సి ఉంటుందని పలువురు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో అన్ని సేవలు అందేవి..



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందేవి. ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలపై సమాచారం అందించేవారు. ఏవైనా పత్రాలు కావాలి అంటే దరఖాస్తు చేస్తే అక్కడికే ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పత్రాలు కావాలంటే మీసేవ కేంద్రానికి లేదా మండల కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– పి.నాగార్జున, మాజీ వాలంటీర్

ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.



గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా సచివాలయానికి వెళ్లి పనులు చేసుకునే వాళ్లం. సచివాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. మీ–సేవా కేంద్రాలు మండల కార్యాలయాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు అందించాల్సిన సేవలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– ఏ.పెద్దిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్

క్లుప్తంగా

పేదలకు పట్టాలివ్వాలని వినతి

పామూరు: మండలంలోని మోట్రావులపాడు రెవెన్యూ పరిధిలోని గోపాలపురం సమీపంలో ఉన్న సర్వేనంబర్ 167/3 లో అర్హులైన పేదలకు నివేశనాస్థలాలు ఇవ్వాలని గురువారం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, డి.లక్ష్మణరావు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అదే స్థలంలో కొందరు ఫెన్సింగ్ వేస్తున్నారన్నారు.

తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలి

సీఎస్‌పురం(పామూరు): మామిడి రైతులు తామర, తేనెమంచు పురుగు తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన శాఖాధికారి కె.కుసుమ అన్నారు. మండలంలోని పెదగోగులపల్లెలోని మామిడి తోటలను గురువారం మండల ఉద్యానవన శాఖాధికారి కె.కుసుమ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓ మాట్లాడుతూ మామిడిలో తామర పురుగు, తేనె మంచుమంచు పురుగు గుర్తించినట్లు తెలిపారు. దీన్ని నివారించేందుకు ఫిప్రోనిల్ లేదా హాస్టాథియాన్ 2 మి.లీ. లేదా ఎఫిసేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి రైతులు అధికారులను సంప్రదించి వారు సూచించిన మేరకు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన చిన్న నరసింహం

పొన్నలూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కందుకూరు–పొన్నలూరు ఓవీ రోడ్డులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. పొన్నలూరు మండలం ముండ్లమూరివారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన రంపతోటి చిన్న నరసింహం తన బంధువుల ఇంట్లో దశదిన కర్మ ఉండటంతో ఆదరణ వస్త్రాలు తేవడానికి కందుకూరు వెళ్లాడు. బైక్‌పై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో చిన్న నరసింహంకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న వారు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. కందుకూరు ఏరియా వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పొగాకు చెక్కుల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడం వల్లే ప్రమాదం సంభవించినట్లు పోలీసులు భావిస్తున్నారు.

వక్ఫ్ బిల్లుపై సుప్రీంలో సవాల్ హర్షణీయం

సింగరాయకొండ: వక్ఫ్ బోర్డు చట్టాన్ని సుప్రీం కోర్టులో సవాల్ చేసిన వైఎస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్ రియాజ్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక హక్కులు ఉల్లంఘిస్తోందని విమర్శించారు. ఈ దేశంలో అన్ని మతాలు సమానమేనని, కానీ వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలను అణచివేసే విధంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి


విద్యార్థినుల బరువు కొలతలను పర్యవేక్షిస్తున్న సీడీపీఓ మాధవీలత

కొండపి: రక్తహీనత సమస్య రాకుండా కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ మాధవీలత పేర్కొన్నారు. పోషణ్ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సూపర్‌వైజర్ విక్టోరియారాణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల్లో రక్తహీనత చాలా సాధారణమన్నారు. రక్త పరీక్షతో హిమోగ్లోబిన్ స్థాయిని తెలుసుకోవచ్చని, తద్వారా ఇతర ఆరోగ్య సమస్యలను నివారించుకోవచ్చన్నారు. ఏఎన్ఎం సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసీపల్లి పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరా



పీసీపల్లి: నేరాలను నియంత్రించేందుకు పీసీపల్లి పోలీస్‌స్టేషన్‌కు లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ బద్దల రత్నారెడ్డి డ్రోన్ కెమెరా అందజేశారు. మార్కాపురంలో గురువారం జరిగిన జిల్లా నేర సమీక్ష సమావేశంలో డ్రోన్ కెమెరాను ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా రత్నారెడ్డిని ఎస్పీ అభినందించారు. కనిగిరి డీఎస్పీ ఈశ్వర్‌సాయి ఈశ్వంత్, సీఐ ఖాజావలి, పీసీపల్లి ఎస్సై కోటయ్య తదితరులు పాల్గొన్నారు. డ్రోన్ కెమెరాపై కానిస్టేబుల్ పత్తి వెంకటేశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు దుర్మార్గం

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజం


కందుకూరు కోర్టు వద్ద వెంకట్రావును పరామర్శిస్తున్న ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ నాయకుడు మసనం వెంకట్రావుపై అక్రమ కేసు బనాయించి పోలీసులు కోర్టులో హాజరుపరిచారని, ఇది ముమ్మాటికీ దుర్మార్గపు చర్య అని ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. గురువారం కందుకూరు కోర్టు వద్ద మసనం వెంకట్రావును ఆయన పరామర్శించారు. ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. ఏడాది క్రితం ఎక్కడో జరిగిన ఘటనపై ఎవరో స్పీడ్ పోస్టులో పంపించిన ఫిర్యాదుపై బలవంతపు వసూళ్లంటూ పోలీసులు కేసు బనాయించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తోందని, ఈ కేసు అందుకు ఒక ఉదాహరణ అని విమర్శించారు. మసనంపై పోలీసులు అక్రమంగా బెట్టింగు కేసు నమోదు చేశారని, 41ఏ నోటీసు ఇచ్చి, స్టేషన్ బెయిల్ ఇస్తామని నమ్మబలికి తీరా వచ్చిన తర్వాత కేసులు ఉన్నాయంటూ అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. అక్రమ అరెస్టుపై న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు.

పోలీసులకు అందుబాటులో ఉంటానని, విచారణకు సహకరిస్తానని చెప్పినప్పటికీ ఏకపక్షంగా నాన్ బెయిలబుల్ సెక్షన్‌లు పెట్టి రిమాండ్‌కు పంపడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనపై పోరాటాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.

నజ్మాకు పారితోషికం అందజేసిన దద్దాల


నజ్మాకు ప్రోత్సాహక నగదు అందజేస్తున్న దద్దాల

కనిగిరిరూరల్: ఇంటర్ ఫలితాల్లో బైపీసీలో 989 మార్కులు సాధించిన పట్టణానికి చెందిన ఎస్‌కే నజ్మాకు వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ గురువారం రూ.10 వేలు పారితోషకం అందచేసి అభినందించారు. తోపుడు బండిపై వ్యాపారం చేస్తూ ఎంతో కష్టపడి కుమార్తెను చదివిస్తున్న ఎస్‌కే మహ్మద్‌ను కొనియాడారు. పట్టుదల కృషితో చదివి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవుల భాస్కర్‌రెడ్డి, కటికల వెంకట రత్నం, గాండ్ల పర్తి ఆదినారాయణరెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, గోనా జేమ్స్, తాతపుడి నాని, గంజి రవీంద్రారెడ్డి, ఎస్‌కే ఖాజా,పాతిరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం వహించవద్దు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


టంగుటూరు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొండపి: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు నిర్లక్ష్యం వహించవద్దని అగ్నిమాపక శాఖ అధికారి సీహెచ్ వెంకటరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కొండపిలోని హ్యాపీ కిడ్స్ హైస్కూల్, శాంతినికేతన్ హైస్కూల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే ఆందోళన చెందకుండా ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు నివారించే పద్ధతులపై విద్యార్థులు, పాఠశాల సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదానికి కారణమయ్యే వస్తువులను దూరంగా ఉంచాలని, ఇసుక, ఫైర్ సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

టంగుటూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం సింగరాయకొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు టంగుటూరు ఫైర్ ఆఫీసర్ ఏ రమణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. అగ్ని ప్రమాద రకాలను వివరించారు. ఫైర్ సిబ్బంది పాల్ బర్నబా, బాలకృష్ణ, యేసేపు సుబ్బారావు, విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

చెత్త నుంచి సంపద సృష్టిద్దాం

సింగరాయకొండ: చెత్త నుంచి సంపద సృష్టించి ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ పి.విజయశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారులు, డ్వాక్రా మహిళలతో ప్రమాణం చేయించారు. సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, స్వచ్ఛాంధ్ర టీం సభ్యులు ఎండీ జోహాయ్, టి.విజయ్, ఆర్.సాయికృష్ణ, ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ, ఎంపీడీఓ డి.జయమణి, పంచాయతీ కార్యదర్శులు రామారావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు లాభదాయకం



టంగుటూరు: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని నేచురల్ ఫార్మింగ్ అధికారి కిషోర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో మండలంలోని కందులూరు గ్రామంలో 0.50 సెంట్లలో 5 రకాల కూరగాయల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో పండిన కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యంతో పాటు రైతుకు ఆదాయం సమకూరుతున్నారు. కార్యక్రమంలో ఎల్ 1 వెంకటరావు, ఐసీఆర్పీ సుజాత, యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, త్రివేణి, శృతి, హరిత, కవిత, పద్మావతి, జోత్స్న, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన 'సర్వేపల్లి'

పొన్నలూరు: ఉపాధ్యాయ వృతింతకి వన్నెతెచ్చిన మార్గదర్శకుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు అన్నారు. గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు ఇవ్వండి


ఫైనాన్స్ కమిషన్‌కు వినతి పత్రం ఇస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. గురువారం తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో 16వ ఫైనాన్స్ కమిషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలోని15 మంది మేయర్లు, మున్సిపల్ చైర్మన్లతో స్థానిక సంస్థల బలోపేతం, అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ కనిగిరి మున్సిపాలిటీకి సాధ్యమైనంతగా అధిక నిధులు ఇవ్వాలని, మున్సిపల్ ఆఫీసు నిర్మాణానికి రూ.6 కోట్లు, కూరగాయల మార్కెట్‌కు రూ.3 కోట్లు, మటన్, ఫిష్ మార్కెట్‌కు రూ. 3 కోట్లు, నూతన డ్రైన్‌ల నిర్మాణాలకు రూ.4 కోట్లు, నీటి సరఫరాకు ఏఎస్‌సీ గ్రాంట్‌ను ప్రత్యేకంగా మంజూరు చేయాలని 16వ ఫైనాన్స్ కమిషన్ ఆఫ్ ఇండియా డాక్టర్ అరవింద పనగరియాకు, రాష్ట్ర మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి సురేష్ కుమార్‌కు విన్నవించినట్లు చైర్మన్ గఫార్ తెలిపారు.

పైపులు బాగుచేసి.. వ్యర్థాలు వదిలేసి..


వేమవరంలో పగిలిన తాగునీటి పైపులు


చెరువు కట్ట కింద పొలాల్లో పడిఉన్న పైపు ముక్కలు

మర్రిపూడి: మండలంలోని వేమవరం గ్రామ శివారులోని చెరువు కట్ట సమీపంలో వారం క్రితం రామతీర్థం రిజ్వాయర్ నుంచి కనిగిరి వెళ్లే 600 ఎంఎం తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. లీకైన ప్రదేశంలో గుంటతీసి మరమ్మతులకు గురైన పైపులు తొలగించారు. నూతన పైపులు వేసి పై గ్రామాలకు తాగునీరు సరఫరా చేశారు. అయితే పగిలిన 600 ఎంఎం పైపుల శిథిలాలను అక్కడే వదిలేశారు. పగిలిన పైపు ముక్కలు మేతకోసం వెళ్లిన మూగజీవాలకు గుచ్చుకొని గాయాలవుతున్నాయని పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల అనంతరం ఇష్టానుసారంగా పొలాల వెంట ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వదిలేయడంపై వేమవరం గ్రామస్తులు మండిపడుతున్నారు. పైపుల వ్యర్థాలను తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండో రోజు కొనసాగిన ధర్నా

టంగుటూరు: తమ సమస్యలు పరిష్కరించాలంటూ టోల్ ప్లాజా సిబ్బంది రెండో రోజు ధర్నా నిర్వహించారు. రెండవ రోజు ధర్నాకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి సంఘీభావం తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్నా ఇంతవరకు యాజమాన్యం పట్టించుకోకపోవడం దౌర్భాగ్యమన్నారు. యాజమాన్యం దిగిరాకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని హెచ్చరించారు. సిబ్బంది డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాము, టోల్ ప్లాజా యూనియన్ ప్రెసిడెంట్ తిరుమలరావు, కార్యదర్శి కాశీ విశ్వనాథ్, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

కనిగిరిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో గురువారం ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన మోడి సర్కార్ గద్దెనెక్కిన తర్వాత వాటిని విస్మరించిందన్నారు. కూటమి సర్కార్ నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పి తీవ్రంగా మోసం చేసిందన్నారు. భగత్ సింగ్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ నుంచి దేశంలోని యువతకు ఉద్యోగాలు కల్పించాలని, సమగ్ర యువజన విధానం అమలు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ మే 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతి నగరంలో జరిగే 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ మహాసభలకు నిరుద్యోగులు, యువకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పుట్టా సుబ్బారావు, పూర్ణ చంద్రరావు, పవన్ కళ్యాన్, ఇఫ్రాజ్, ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

21న కనిగిరిలో మహా నిరసన ర్యాలీ


మాట్లాడుతున్న ముఫ్తిలు, మౌలానాలు, ముస్లిం నేతలు

- వక్ఫ్‌బిల్లు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

కనిగిరిరూరల్: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా, వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ జమియతే–ఉలమా– ఏ– హింద్, అంజుమన్– ఏ– ఇస్లామియా కమిటి, జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 21న సోమవారం నియోజకవర్గ కేంద్రమైన కనిగిరిలో మహా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. స్థానిక షాదీఖానాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మౌలానాలు ఖాశిం, అర్షద్, గులాం రసూల్, మహమ్మద్ అలీ, సద్దాం, యాకోబ్, యూనస్, అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే అహమ్మద్ హుస్సేన్, మాజీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు రోషన్ సందాని, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సయ్యద్ యాసీన్‌లు మాట్లాడారు. కనిగిరిలో జరిగే నిరసన ర్యాలీ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రతి గ్రామం నుంచి ముస్లింలు, లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, మాజీ అంజుమన్ కమిటీ కార్యదర్శి సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆమోదించబడిన వక్ఫ్ చట్టం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనతో పాటు వక్ఫ్ ధార్మిక సంక్షేమ విధానాలకు విఘాతం కల్గిస్తోందన్నారు. ముస్లింకు సంబంధించిన వక్ఫ్ ఆస్తుల విషయంలో ప్రభుత్వ జోక్యం చేసుకోవడమే కాకుండా.. వాటిని అన్యాక్రాంతం చేసే కుట్రగా అభివర్ణించారు. దీనికి వ్యతిరేకంగా ఈనెల 21న కనిగిరిలో చేపట్టే మహా నిరసన కార్యక్రమంలో ముస్లిం సోదరులు, లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జు0

కోల్డ్ స్టోరేజీల్లో పొగాకు బేళ్ల వివరాలు తెలియజేయాలి

కొండపి: శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలు తెలియజేయాలని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం వేలం సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ దగ్గర ఉన్న బేళ్ల వివరాలను బోర్డుకు తెలియపరచాలని, అనధికారికంగా పొగాకు అమ్మరాదని స్పష్టం చేశారు. కాగా గురువారం నిర్వహించిన వేలంలో ముప్పవరం, చోడవరం గ్రామాలకు చెందిన రైతులు 664 బేళ్లు తీసుకురాగా అందులో 570 కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 94 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.230, సరాసరి ధర కేజీ రూ.263.85గా నమోదైంది. వేలంలో 14 కంపెనీలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా వేలం కేంద్రానికి సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

పొగాకు సరాసరి ధర కేజీ రూ.259.94

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం సరాసరి ధర కేజీ రూ.259.94గా నమోదైంది. కె.ఉప్పలపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు 513 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 428 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 84 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.225గా నమోదైందని వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. వేలంలో 12 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.